సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం । 9 । ఆగస్టు । 2023



చీనీ టన్ను రూ.16 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.16 వేలు పలికాయి. మార్కెట్‌కు 476 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.120
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.120, కనిష్టంగా రూ.75, సరాసరిన రూ.95 ప్రకారం పలికింది.

గరిష్టం/కనిష్టం
36.3°/ 22.1°
జిల్లాలో మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి. గంటకు 8 నుంచి 10 కి.మీ వేగంగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఏపీ నాటక అకాడమీ చైర్‌పర్సన్‌గా ప్రమీల



అనంతపురం కల్చరల్: ఏపీ నాటక అకాడమీ చైర్‌పర్సన్‌గా జిల్లాకు చెందిన హనుమన్న గారి ప్రమీలను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. బడుగు, బలహీన వర్గాలవారికి మరోసారి సమున్నత పదవినిచ్చి గౌరవించింది. నాటక అకాడమీ చైర్‌పర్సన్‌గా ఉన్న రాగే హరిత పదవీకాలం ముగియడంతో మరోసారి జిల్లావాసికే ఆ అవకాశం కల్పించింది. శింగనమల మండలం బండమీదిపల్లికి చెందిన వీరాంజనేయులు భార్య ప్రమీల పెద్దపప్పూరు మండలం జూటూరు గ్రామానికి చెందినవారు. ఆమె డిగ్రీ వరకు తాడిపత్రిలో చదువుకున్నారు. తొలుత కాంగ్రెస్‌లో ఉన్న వీరాంజనేయులు కుటుంబం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి జగన్‌మోహన్‌రెడ్డి వెంట నడిచారు. వీరాంజనేయులు తండ్రి వెంకటప్ప గతంలో సర్పంచ్‌గా పనిచేశారు. నాటక అకాడమీ చైర్‌పర్సన్‌గా ఎంపికైన ప్రమీల తల్లి లక్ష్మీదేవి కూడా సర్పంచ్‌గా ప్రజలకు సేవలందించారు. ఈ నేపథ్యంలో దళితులకు మరోసారి గొప్ప అవకాశం ఇవ్వడం పట్ల వీరాంజనేయులు, ప్రమీల హర్షం వ్యక్తం చేశారు. చైర్‌పర్సన్‌గా ఎంపిక చేసిన సీఎం జగన్‌కు, సహకరించిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి, రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నాటక రంగానికి పూర్వ వైభవం తెచ్చే విధంగా కళాకారుల అభ్యున్నతికి తోడ్పాటునందిస్తామని ప్రమీల తెలిపారు.

కానిస్టేబుల్ రణధీర్‌కు అండగా ఉంటాం

- రాష్ట్ర పోలీసు అసోసియేషన్‌కు ఎస్పీ మాధవరెడ్డి హామీ



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాష్ట్ర పోలీస్ అసోసియేషన్ సభ్యులు

పుట్టపర్తి టౌన్: ఇటీవల పుంగనూరులో జరిగిన ఘటనలో కన్ను కోల్పోయిన రణధీర్‌కు, అతని కుటుంబానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని ఎస్పీ మాధవరెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని రాష్ట్ర పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, ట్రెజరర్, జాయింట్ సెక్రటరీలు సోముశేఖర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, ఉమ్మడి అనంతపురం జిల్లా అడహాక్ కమిటీ సభ్యులు త్రిలోకనాథ్ తదితరులు ఎస్పీ మాధవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఎస్పీతో మాట్లాడుతూ... నూతన జిల్లాలో పోలీస్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు, పోలీస్ కుటుంబాల సంక్షేమం కోసం తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అలాగే పుంగనూరు ఘటనలో కన్ను కోల్పోయిన కానిస్టేబుల్ రణధీర్ కుటంబానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, వయస్సుపైబడిన పోలీస్ సిబ్బందికి దూరప్రాంత బందోబస్తుల డ్యూటీల్లో మినహాయింపు ఇవ్వాలని విన్నవించారు. స్పందించి ఎస్పీ మాట్లాడుతూ... పోలీసుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామన్నారు. అలాగే కన్ను కోల్పోయిన రణధీర్ కుటుంబాన్ని ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు అసోసియేషన్ జిల్లా అడహాక్ కమిటీ సభ్యులు సుధాకర్‌రెడ్డి, తేజ్ పాల్, సరోజ పాల్గొన్నారు.

బియ్యం కార్డులొచ్చాయి!

బియ్యం కార్డు పొందాలంటే గతంలో సవాలక్ష నిబంధనలు. అర్హతలున్నా కార్యాలయాల చుట్టూ నెలల తరబడి ప్రదక్షిణలు చేస్తేగానీ మంజూరు అయ్యేది కాదు. సచివాలయ వ్యవస్థతో ఇప్పుడంతా మారిపోయింది. అర్హత ఉంటే చాలు వలంటీర్‌కు దరఖాస్తు ఇస్తే వెంటనే కార్డు మంజూరు అవుతోంది. అదే నెలలో రేషన్ కోటా కూడా అందిస్తున్నారు. తాజాగా జిల్లాకు 3,385 కార్డులు మంజూరు కాగా లబ్ధిదారులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- నూతన బియ్యం కార్డులు మంజూరు
- సచివాలయాల్లో లబ్ధిదారులకు అందజేత
- ఈ నెల నుంచే రేషన్ సరుకుల పంపిణీ



పుట్టపర్తి అర్బన్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలకిచ్చే బియ్యం కార్డుల మంజూరు ప్రక్రియ సులభతరం చేసింది. అర్హత ఆధారంగా వెంటనే మంజూరు చేస్తోంది. వలంటీర్లే ఇంటింటికీ తిరిగి అర్హులను గుర్తించి దరఖాస్తు చేయిస్తున్నారు. అవసరమైన ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారుల నుంచి తీసుకొని వారే సచివాలయాల్లో అందిస్తూ కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయిస్తున్నారు.

అర్హత ఉంటే... అడిగిన వెంటనే మంజూరు

గత నెలలో జిల్లా వ్యాప్తంగా 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహించగా, బియ్యంకార్డుల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. అర్హులను గుర్తించిన అధికారులు 3,384 కుటుంబాలకు కొత్తగా రేషన్ కార్డులు మంజూరు చేశారు. అలాగే రేషన్ కార్డులు మంజూరు ప్రక్రియ నిరంతరం కొనసాగాలే ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈక్రమంలో కొత్తగా పెళ్లయిన దంపతులు, ఉమ్మడి కుటుంబాల నుంచి విడిపోయి వేరు కాపురం పెట్టిన వారు దరఖాస్తు చేయగానే కొత్త రేషన్ కార్డు మంజూరు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలోని 32 మండలాల పరిధిలో 5,60,914 రేషన్ కార్డులున్నాయి. ఈ కార్డుల ద్వారా ప్రతి నెలా 8,700 మెట్రిక్ టన్నుల బియ్యం ఉచితంగా అందజేస్తున్నారు. తక్కువ ధరకే పంచదార, కంది పప్పు, రాగులు, పట్టణ ప్రాంతాల్లో గోధుమపిండి, తదితర సరుకులను ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే చేరుస్తున్నారు.

నేటి నుంచి పంపిణీ

కొత్త బియ్యం కార్డులను ఎలాంటి హంగూ ఆర్భాటం లేకుండా పంపిణీ చేయాలని అధికారులు భావిస్తున్నారు. అందులో భాగంగా వలంటీర్లను లబ్ధిదారుల ఇళ్లకు పంపి కార్డు అందించడం, లేదా సచివాలయాలకు పిలిపించి ఇవ్వాలని భావిస్తున్నారు. లబ్ధిదారు సచివాలయానికి వెళ్లగానే కార్డు ప్రింట్ తీసి వెంటనే అందజేస్తారు. కొత్త కార్డులకు ఈ నెలలోనే పంపిణీ చేయడానికి అవసరమైన బియ్యం, రాగులు, చక్కెర, కంది బేడలను అధికారులు సరఫరా చేశారు. జిల్లాలో 1,367 చౌక దుకాణాలుండగా, ఇంటి వద్దనే బియ్యం అందించేందుకు 349 వాహనాలు అందుబాటులో ఉన్నాయి.

5.60 లక్షలు
జిల్లాలో ప్రస్తుతమున్న బియ్యం కార్డులు

3,384
కొత్తగా మంజూరైన కార్డులు

8,700 మెట్రిక్ టన్నులు
ప్రతి నెలా ప్రభుత్వం ఇస్తున్న బియ్యం

ధర్మవరానికి అత్యధికం

నూతన రేషన్ కార్డులు అత్యధికంగా ధర్మవరం మండలానికి 291 మంజూరయ్యాయి. ఆ తర్వాత హిందూపురం అర్బన్ 188, ముదిగుబ్బ 153, గోరంట్ల 151, పుట్టపర్తి 144, తనకల్లు 132, ఓడీ చెరువుకు 131, చెన్నేకొత్తపల్లి 130, తాడిమర్రి 121, కనగానపల్లి 116, మడకశిర 116 , పెనుకొండ 110, బత్తలపల్లి 107, కదిరి 104 కార్డులు మంజూరయ్యాయి.

దరఖాస్తు చేసిన వెంటనే మంజూరు



రేషన్ కార్డు మంజూరు కాక గతంలో చాలా ఇబ్బంది పడ్డాం. ప్రస్తుతం సచివాలయంలో వలంటీర్ ద్వారా రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నా. వెంటనే కార్డు మంజూరు చేశారు. ఇలాంటి ప్రభుత్వాన్ని నా జీవితంలో ఎప్పుడూ చూడలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. 'జగనన్న సురక్ష' చాలా మంచి కార్యక్రమం. ఎందరికో మేలు జరిగింది.

– సుబ్బమ్మ, కర్ణాటకనాగేపల్లి, పుట్టపర్తి

కొత్తకార్డులకూ సరుకులిస్తాం



జిల్లాలో కొత్తగా 3,384 కుటుంబాలకు బియ్యం కార్డులు మంజూరయ్యాయి. వారికి కూడా ఆగస్టు కోటా అందజేసేందుకు అవసరమైన సరుకులు డీలర్లకు సరఫరా చేశాం. నూతన కార్డుదారులు బుధవారం నుంచి బియ్యం, రాగులు సైతం తీసుకెళ్లవచ్చు. వారికి కూడా ఫోర్టిఫైడ్ బియ్యాన్నే అందజేస్తారు. ప్రస్తుతం జిల్లాలోని 5.60 లక్షల కార్డులకు 8,700 మెట్రిక్ టన్నుల బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నాం.

– వంశీకృష్ణారెడ్డి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి

జగనన్న కాలనీల్లో సౌకర్యాలు కల్పించాలి

- కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం



జగనన్న కాలనీలో రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు తదితరులు

గోరంట్ల: జగనన్న కాలనీల్లో మౌలిక వసతులన్నీ కల్పించాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని మల్లాపల్లి సమీపంలో ఉన్న జగనన్న కాలనీని సందర్శించారు. కాలనీ ముఖద్వారం వద్ద ఆర్చ్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. 20వ తేదీలోపు ఆర్చ్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ ఈఈ మురళిని ఆదేశించారు. అలాగే నెలాఖరులోపు కాలనీలో రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ సందర్భంగా కాలనీలో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై హౌసింగ్ అధికారులతో సమీక్షించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న మల్లాపల్లి గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అక్కడి నుండి నేరుగా పాలసముద్రం చేరుకున్న కలెక్టర్ సచివాలయ నిర్మాణ పనులను పరిశీలించారు. కలెక్టర్ వెంట పంచాయతీరాజ్ ఎస్ఈ గోపాల్‌రెడ్డి, హౌసింగ్ పీడీ చంద్రమౌళి రెడ్డి, తహసీల్దార్ రంగనాయకులు, ఎంపీడీఓ రఘునాథగుప్త, ఎంపీపీ ప్రమీల, జెడ్పీటీసీ సభ్యులు పాలే జయరాం నాయక్, మల్లాపల్లి సర్పంచ్ శివానంద, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రదర్శించాలి

సోమందేపల్లి: ప్రభుత్వం సంక్షేమ పథకాల సమాచారాన్ని సచివాలయాల్లో తప్పకుండా ప్రదర్శించాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. మంగళవారం ఆయన మండలంలోని గుడిపల్లిలోని గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. సేవల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు. అంతకుముందు కలెక్టర్ నిర్మాణంలో ఉన్న తుంగోడు గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను పరిశీలించారు. నిర్మాణాలు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ కార్తిక్, తహసీల్దార్ సురేష్ కుమార్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు ఉన్నారు.

క్రీడాస్ఫూర్తిని చాటేలా 'ఆడుదాం ఆంధ్ర'

- అక్టోబర్ 2 నుంచి వివిధ అంశాల్లో క్రీడా పోటీలు
- ఏర్పాట్లు ఘనంగా చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, చిత్రంలో ఏఎస్పీ విష్ణు, డీఆర్‌ఓ కొండయ్య తదితరులు

పుట్టపర్తి అర్బన్: 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాన్ని క్రీడాస్ఫూర్తిని చాటేలా జిల్లాలో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని స్పందన హాలులో అడిషనల్ ఎస్పీ విష్ణు, డీఆర్‌ఓ కొండయ్య, జిల్లా చీఫ్ కోచ్ ఉదయ్‌భాస్కర్‌తో కలిసి 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...మహాత్మా గాంధీ జయంతి రోజైన అక్టోబర్ 2వ తేదీ నుంచి 45 రోజుల పాటు 'ఆడుదాం ఆంధ్ర' క్రీడోత్సవాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సచివాలయ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో పురుషులు, మహిళలకు వేర్వేరుగా పోటీలు ఉంటాయన్నారు. వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ, క్రికెట్ వంటి క్రీడలు ఉంటాయని, కార్యక్రమంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. అలాగే 'ఆడుదాం ఆంధ్ర' మస్కట్, లోగో రూపొందించాలనుకునే వారు ఈనెల 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పంపాలన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు కింద రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు అందజేస్తారన్నారు.

'నా భూమి– నా దేశం' విజయవంతం చేద్దాం


ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఈనెల 9 నుంచి 20వ తేదీ వరకూ 'నా భూమి–నా దేశం' కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పంచాయతీలు, మండలాలు, పట్టణ ప్రాంతాల్లో కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. 9వ తేదీ అన్ని గ్రామాలు, పట్టణాల్లో ప్రధాని, సీఎం సందేశాలతో పాటు స్వాతంత్ర్య సమర యోధులు, వీరులను గుర్తు చేసుకుంటూ అమృత్ సరోవర్లు, నీటి వనరుల వద్ద జ్ఞాపక శిలాఫలకాలను ఏర్పాటు చేసి సెల్ఫీలు తీసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. 10న 'పంచ ప్రాణ్' ప్రతిజ్ఞ చేసి సెల్ఫీ తీయాలన్నారు. 11న 'వసుధకు వందనం' పేరుతో 75 మొక్కలను నాటాలని, 14న 'వీరులకు వందనం' పేరుతో అమర వీరుల కుటుంబాలను సత్కరించి ఫోటోలు అప్‌లోడ్ చేయాలన్నారు. 15వ తేదీన జాతీయ జెండా ఎగురవేసి వందన సమర్పణ చేయాలన్నారు. 16 నుంచి 20వ తేదీ వరకూ వివిధ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ నియోజకవర్గాల నుంచి మట్టిని సేకరించి కలశాల్లో నింపి ఢిల్లీలో జరిగే 'కర్తవ్యపథ్'లో అందించాలన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ రామాంజనేయులు, డీపీఓ విజయ్‌కుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌బీఐలో రూ.కోటి స్వాహా

- మేనేజరే సూత్రధారి
- బినామీ ఖాతాలకు నగదు మళ్లింపు
- డీజీఎం ఫిర్యాదుతో కేసు నమోదు
- ఆలస్యంగా వెలుగులోకి..

రాయదుర్గం: పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) బ్రాంచులో రూ.కోటి నగదు స్వాహా అయ్యింది. ఈ విషయం రెండు నెలల తర్వాత ఆలస్యంగా బయటకు పొక్కింది. మంగళవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. రాయదుర్గం అర్బన్ సీఐ లక్ష్మన్న తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గతంలో ఇక్కడ మేనేజర్‌గా ఎస్ఎల్ఎన్ ఫణికుమార్ పనిచేశారు. ఆయన తన తల్లితో పాటు ఇతరుల ఖాతాలకు రూ.1,00,07,323 నగదును మళ్లించారు. దీన్ని ఉన్నతాధికారులు గుర్తించి తనిఖీలు నిర్వహించారు. నగదు ఇతరుల ఖాతాలకు అక్రమంగా మళ్లించినట్లు నిర్ధారించుకున్నారు. ఈ ఏడాది జూన్ 21న ఎస్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ వెంకటేశ్వరరావు స్థానిక అర్బన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మేనేజర్ ఎస్ఎల్ఎన్ ఫణికుమార్ పై 409, 420, 468, 471, 477–ఏ ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నిందితుడు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. ఇదిలా ఉండగా.. ఈ విషయం బయటకు పొక్కకుండా ఎస్‌బీఐ సిబ్బంది, పోలీసులు ఇన్నాళ్లు జాగ్రత్త పడ్డారు. అయితే ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఎట్టకేలకు బహిర్గతమైంది. బ్యాంకు అధికారులు నగదు రికవరీ చేయడంతో పాటు మేనేజరును విధుల నుంచి సస్పెండ్ చేసినట్టు తెలిసింది.

టీబీ డ్యాంలో 86 టీఎంసీల నీరు



బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయంలో మంగళవారం 86.239 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 17,464 క్యూసెక్కులు నమోదైంది. ఆర్‌బీసీకి, హెచ్చెల్సీ, ఎల్ఎల్‌సీ తదితర కాలువలకు 8,892 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఆంధ్రా సరిహద్దులో 105వ కిలోమీటర్ వద్ద హెచ్చెల్సీకి 1,229 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 1,633 అడుగులు కాగా, ప్రస్తుతం 1627.86 అడుగులకు నీరు చేరింది. గతేడాది ఇదే సమయానికి జలాశయంలో 101.421 టీఎంసీల నీరు నిల్వతో 1,08,648 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 1,05,909 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉండేది.

చదువుతోనే బంగారు భవిత



పామిడి టీసీ హైస్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న విజయప్రతాప్‌రెడ్డి

గార్లదిన్నె/పామిడి/గుత్తి/గుత్తి రూరల్/ గుంతకల్లు రూరల్: విద్యార్థులు బాగా చదువుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఏపీ స్టేట్ ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయప్రతాప్ రెడ్డి సూచించారు. విద్యార్థులకు చదువే ఆస్తి కావాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, బోధన ప్రమాణాలు మెరుగుపరిచారన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. చైర్మన్ రెండు రోజుల జిల్లా పర్యటన ముగిసింది. మంగళవారం గార్లదిన్నె కేజీబీవీ, మోడల్ స్కూల్, ఇందిరమ్మ కాలనీ, బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. కేజీబీవీలో చదువుకున్న విద్యార్థిని నిఖిల ప్రభుత్వ ఎంబీబీఎస్ సీటు సాధించడం అభినందనీయమన్నారు. గార్లదిన్నె ఇందిరమ్మ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు మెరుగైన విద్యాబోధనతో పాటు, రుచికరమైన భోజనం అందించిన అంగన్‌వాడీ సిబ్బందిని శాలువాతో సత్కరించారు. ఒకొక్కరికి రూ.1000 చొప్పున నగదు ప్రోత్సాహం అందించి అభినందించారు.

మధ్యాహ్న భోజనం సంతృప్తికరం

పామిడి టీసీ హైస్కూల్‌ను ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ తనిఖీ చేశారు. ఇక్కడ మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు అందించే కోడిగుడ్లు నిర్దేశిత బరువు ఉన్నాయా లేదా అని తూకం వేసి చూశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం 15తో పాటు 17వ కేంద్రాన్ని పరిశీలించారు. టీహెచ్ఆర్ పంపిణీపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు.

మెనూ పక్కాగా పాటించాలి

మధ్యాహ్న భోజన పథకంలో మెనూ పక్కాగా పాటించాలని చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి ఉపాధ్యాయులను ఆదేశించారు. గుత్తి పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. మెనూ ప్రకారం ఆహారం పెట్టకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం దాసరి కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆ తర్వాత రజాపురం డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, సేవాగఢ్‌లోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించారు. అక్కడి నుంచి గుంతకల్లు కేజీబీవీ., బీసీ బాలుర వసతిగృహాన్ని తనిఖీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో డీఎస్ఓ శోభారాణి, డీఈఓ సాయిరామ్, డీసీఓ మురళీకృష్ణ, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ఆర్డీఓ రవీంద్ర, సీడీపీఓలు ఉమాశంకరమ్మ, డిల్లీశ్వరి, తహసీల్దార్లు ఉషారాణి, ఆర్.వి.సునీతాబాయి, మహబూబ్‌బాషా, ఎంపీడీఓలు ప్రభాకర్‌నాయక్, ఎంఈఓలు జయానాయక్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

'పాప'ం.. పసికందు!

అప్పుడప్పుడే కళ్లు తెరిచిన ఆడశిశువు.. ముట్టు ఆరనేలేదు.. బొడ్డు కోయనేలేదు.. అంతలోనే 'పాప'ం.. తల్లి ఒడికి దూరమైంది.. అబలని భారమనుకున్నారా.. అరిష్టమని భావించారో.. మండే ఎండలో ముళ్ల పొదల మాటున ఒంటరయ్యింది. అంతా నిర్మానుష్యం.. లాలించేవారులేరు.. పాలుపట్టేదెవరు..? దిక్కులు పిక్కటిల్లేలా గుక్కపెట్టి ఏడుస్తుంటే.. ఈ ఆక్రందన అటుగా వెళ్లేవారి చెవిన పడింది. వెతికి వెతికి చూడగా మట్టిపై పడి ఉన్న పసికందు కంటపడింది. చేతపట్టి, పోలీసులకు అప్పగించారు.



వైద్యుల పర్యవేక్షణలో ఉన్న ఆడశిశువు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: తల్లి పొత్తిళ్లలో ఉండాల్సిన పసికందు మంగళవారం నగర శివారులోని రాజీవ్‌కాలనీ పంచాయతీ రిక్షాకాలనీ రోడ్డు పక్కన ముళ్లపొదల్లోకి చేరింది. ఆకలికి అలమటించింది. ఓ వైపు ఎండకు భూమి వేడెక్కుతోంది. భరించలేని పసికందు ఏడవటం మొదలెట్టింది. ఎంతసేపటి నుంచి ఆక్రందన చేస్తోందో తెలియదు గానీ ఉదయం పదిన్నర గంటల సమయంలో అటువైపు వెళ్తున్న వారికి వినిపించింది. వెతుకుతూ పోతే ముళ్ల పొదల నడుమ పండంటి ఆడబిడ్డ కనిపించింది. దగ్గరకు తీసుకుని చూస్తే బొడ్డు పేగు కూడా అలానే ఉంది. ఇంటిలోనో.. లేక నిర్మానుష్య ప్రదేశంలోనే ప్రసవం జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు. ఆడపిల్ల అని భారమనుకున్నారో.. లేక ఎవరైనా కుటుంబ సభ్యులకు తెలియకుండా కక్షతో శిశువును తీసుకొచ్చేశారో.. లేదా పెళ్లి కాకనే గర్భం దాల్చి ప్రసవించడం వల్ల సమాజానికి చూపించలేక ఇలా వదిలించుకున్నారో తెలియదు. స్థానికులు అయ్యో పాపం అంటూ దగ్గరికి తీసుకున్నారు. డయల్ 100కు సమాచారం అందించడంతో పోలీసులు హుటాహుటిన రిక్షాకాలనీకి చేరుకున్నారు. పాపను తీసుకుని ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు. వారు సర్వజనాస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. ప్రస్తుతం పాప వైద్యుల పర్యవేక్షణలో ఉంది.

కళ్లల్లో కారం చల్లి..బండరాళ్లతో మోది

- ఆటో డ్రైవర్ దారుణ హత్య
- ఆటోతో ఉడాయించిన దుండగుడు
- సోమందేపల్లి పోలీసులు అదుపులోనికి తీసుకున్న వైనం



దిల్వార్‌బాష (ఫైల్)

లేపాక్షి: ఆటోను బాడుగకు మాట్లాడుకున్న ఓ వ్యక్తి మార్గం మధ్యలో డ్రైవర్ కళ్లలో కారం చల్లి బండరాళ్లతో మోది అతన్ని హతమార్చిన సంఘటన లేపాక్షి మండలం పి.సడ్లపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హిందూపురం బోయపేటకు చెందిన దిల్వార్ బాషా(55) కొంతకాలంగా పట్టణంలో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం సాయంత్రం పట్టణంలోని ఎస్‌బీఐ సర్కిల్ వద్ద ఆటో నిలుపుకుని ఉండగా... ఓ వ్యక్తి పులమతికి వెళ్లాలని కోరగా, అతన్ని ఆటోలో ఎక్కించుకుని బయలుదేరాడు. అయితే ఆటో పి.సడ్లపల్లి సమీపంలో వెళ్లిన తర్వాత సదరు వ్యక్తి ఆటో తోలుతున్న దిల్వార్‌బాషా కళ్లలో కారంపొడి చల్లడంతో అతను ఆటో నిలిపివేశాడు. వెంటనే దుండగుడు బండరాళ్లు, కర్రలతో దారుణంగా కొట్టి హతమార్చాడు. తర్వాత నిందితుడు ఆటోతో పరారయ్యాడు. మంగళవారం ఉదయం అటువైపు వెళ్లిన గ్రామస్తులు మృతదేహాన్ని గుర్తించి లేపాక్షి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిసరాలను పరిశీలించి ఆధారాలు సేకరించారు. నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. కాగా, నిందితుడు ఆటోలో పెనుకొండ వైపునకు వెళ్తుండగా సోమందేపల్లి పోలీసులు పట్టుకున్నారు. మృతుడి భార్య ఫాతిమా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ మున్నీర్ రెహమాన్ తెలిపారు.

క్లుప్తంగా

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృత్యువాత



చెరువులో తేలియాడుతున్న ఫయాజ్‌బాషా మృతదేహం

హిందూపురం అర్బన్: చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి మృత్యువాత పడిన ఘటన కొట్నూరు చెరువులో చోటుచేసుకుంది. వివరాలు.. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన ఫయాజ్‌బాషా (45) సోమవారం పెనుకొండకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో కొట్నూరు సమీపంలో వాహనం ఆపి, చెరువులో చేపలు పట్టేందుకు దిగాడు. అప్పటికే అందులో చేపల కోసం వేసిన వలల్లో చిక్కుకొని ఊపిరాడక మృతి చెందాడు. మంగళవారం ఉదయం చెరువులో మృతదేహం తేలియాడుతున్న విషయం గమనించిన స్థానికులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి షేక్ ఫయాజ్‌గా గుర్తించారు. భార్య షర్మానా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హరూన్ బాషా తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

కేంద్ర బృందం పర్యటన



సచివాలయంలో సేవలపై ఆరా తీస్తున్న కేంద్ర బృందం సభ్యులు

మడకశిరరూరల్: మండలంలోని వైబీహళ్లి గ్రామ సచివాలయం పరిధిలో మంగళవారం కేంద్ర బృందం పర్యటించింది. 'స్వచ్ఛ భారత్ మిషన్' కార్యక్రమంలో భాగంగా నిర్మించిన మరుగుదొడ్లు, అంగన్‌వాడీ, గ్రామ సచివాలయాన్ని సభ్యులు పరిశీలించారు. సక్రమంగా మరుగుదొడ్లు వినియోగిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు వినియోగించుకోవాలని సూచించారు. సచివాలయం ద్వారా అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శైలజ, గ్రామ కార్యదర్శి కృష్ణమూర్తి, ఉద్యోగులు పాల్గొన్నారు.

భూమికి పచ్చాని రంగేసినట్లు

నాడు



టీడీపీ హయాంలో 2014 నుంచి 2019 మార్చి వరకు జిల్లాలో తీవ్ర దుర్భిక్షం నెలకొంది. సాధారణ వరి సాగు విస్తీర్ణం 4,200 హెక్టార్లు కాగా జిల్లావ్యాప్తంగా కనీసం 500 ఎకరాలలో కూడా రైతులు సాగు చేయని దుస్థితి. బోరు బావులు, చెరువుల ఆయకట్టు భూములు బీళ్లు వారి కనిపించేవి. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బుక్కపట్నం చెరువు కింద మోడువారిన ఈ మాగాణి భూములే అందుకు సాక్ష్యం.

కొత్తచెరువు సమీపంలో వరి సాగుతో పచ్చదనం సంతరించుకున్న బుక్కపట్నం ఆయకట్టు భూములివీ. చెరువులో నిండుగా నీరుండడంతో రైతులు జోరుగా వరినాట్లు వేశారు. భూమికి పచ్చని రంగేసినట్లుగా పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. అటువైపు వెళ్లేవారు పొలాలను చూసి మురిసిపోతున్నారు. ఒకప్పుడు బీళ్లు వారిన భూములేనా ఇవి అంటూ ఆశ్చర్యపోతున్నారు.

నేడు



- జిల్లాలో పెరిగిన వరి సాగు
- ప్రభుత్వం ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించటంతో రైతుల ఆసక్తి
- గతంలో బీళ్లుగా ఉన్న మాగాణులు నేడు పంటలతో కళకళ

పుట్టపర్తి: గతంలో కరువుతో నెర్రెలు చీలిన నేలలు నేడు పచ్చదనంతో అలరారుతున్నాయి. టీడీపీ హయాంలో వానలు లేక తీవ్ర దుర్భిక్షంలో కూరుకుపోయిన రైతులు నాలుగేళ్లుగా కరువు తీరా వరుణుడు కురిపించిన నీటితో మురిసిపోతున్నారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన ప్రారంభం కాగానే వర్షాలు జోరందుకున్నాయి. చెరువులు, వంకలు, వాగులు నిండి పోయాయి. దీంతో రైతులు పెద్ద ఎత్తున వరి పంట సాగు చేస్తున్నారు. ప్రభుత్వం ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పిస్తుండడంతో హుషారుగా సాగుతున్నారు. గడచిన నాలుగేళ్లలో పెరిగిన వరిసాగు విస్తీర్ణమే దీనికి నిదర్శనం. ఒకప్పుడు జిల్లాలో ఏటా బోర్లు, బావుల కింద వరి సాధారణ సాగు విస్తీర్ణం 4,200 హెక్టార్లు కాగా అందులో సగం కూడా సాగయ్యేది కాదు. కానీ, నేడు ఒక్క ఖరీఫ్ సీజన్‌లోనే 3 వేల హెక్టార్ల ఎకరాల మేరకు సాగు విస్తీర్ణం పెరిగిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఒక్క బుక్కపట్నం చెరువు కిందే గడిచిన నాలుగేళ్లలో ఖరీఫ్, రబీ కాలాల్లో 12,000కు పైగా హెక్టార్లలో సాగు చేయడం గమనార్హం.

ఏటా సాగు విస్తీర్ణం పెరుగుతోంది



గడిచిన నాలుగేళ్లుగా వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. దీంతో పంటల సాగుకు రైతులు ఉత్సాహం చూపుతున్నారు. జిల్లాలో గత నాలుగేళ్లుగా వరి సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఖరీఫ్ కాలంలో సైతం వరి సాగవుతోంది. ప్రభుత్వం కూడా గిట్టుబాటు ధర కల్పించడంతో రైతులకు సాగు లాభదాయకంగా మారింది.

– సుబ్బారావు జిల్లా వ్యవసాయ అధికారి

జిల్లాలో గడిచిన 10 సంవత్సరాల్లో వరి సాగు వివరాలిలా..

బాబు హయాంలో		జగన్ పాలనలో	
సంవత్సరం	విస్తీర్ణం (హెక్టార్లలో)	సంవత్సరం	విస్తీర్ణం (హెక్టార్లలో)
2014	1,115	2019	2,000
2015	1,020	2020	2,150
2016	940	2021	2,200
2017	845	2022	2,889
2018	800	2023	3,000

నాలుగో ఏడాది పంట



గతంలో అనేక సంవత్సరాలు ఆయకట్టు భూములు బీళ్లగానే ఉన్నాయి. గడచిన నాలుగేళ్లుగా చెరువు ద్వారా సాగుకు నీరందించటం సంతోషంగా ఉంది. పాలించే రాజు మంచివాడైతే రాజ్యం బాగుంటుందన్న సత్యం నేడు సీఎం జగన్‌తో సాధ్యమైంది. నాకున్న 2 ఎకరాల భూమిలో వరుసగా 4వ ఏడాది వరి పంట పెట్టుకున్నా.

– నాగరాజు, రైతు బుక్కపట్నం

ఎకరాకు రూ. లక్ష ఆదాయం



టీడీపీ హయాంలో వర్షాలు లేక మాగాణులు సాగుకు నోచుకోలేదు. నాలుగేళ్లుగా వరుణ దేవుడు కరువు తీరా వర్షించాడు. నేడు రైతులు ప్రతి ఏడాది రెండు పంటలు పండించుకుని ఏడాదికి ఎకరాకు రూ.లక్ష మేర ఆదాయం పొందుతున్నారు. గిట్టుబాటు ధర దక్కడంతో చాలామంది వరి సాగుకు ముందుకు వస్తున్నారు.

– కందుకూరి మారుతీ ప్రసాద్, రైతు, బుక్కపట్నం

'పట్టు బడి'తో రైతులకు సహకారం



మాట్లాడుతున్న జేడీ పద్మమ్మ

పుట్టపర్తి అర్బన్: 'డాక్టర్ వైఎస్సార్ పట్టుబడి' కార్యక్రమం ద్వారా సెరికల్చర్ రైతులకు ప్రభుత్వం సహకారం అందిస్తోందని జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారిణి పద్మమ్మ పేర్కొన్నారు. మంగళవారం కొత్తచెరువు మండలం బైరాపురం రైతు భరోసా కేంద్రంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ మల్బరీ సాగు రైతులకు ప్రభుత్వం సబ్సిడీలు అందజేస్తోందన్నారు. చిన్న, సన్నకారు రైతులు స్వల్ప కాలంలో అధిక లాభాలు పొందడం సెరికల్చర్ ద్వారానే సాధ్యమన్నారు. ఎకరా విస్తీర్ణంలో మొక్కల పెంపకానికి రూ.18,750, షెడ్డు నిర్మించుకోవడానికి రూ.3 లక్షలు మంజూరు చేస్తారన్నారు. షూట్ పరికరాలకు రూ.56,250 అందిస్తున్నట్లు చెప్పారు. రైతులు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఏడీ నరసింహులు, ఎస్‌ఓ సుమముక్త, టీఓ ప్రభాకర్, రైతులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బలవన్మరణం



నరేష్‌కుమార్ రెడ్డి (ఫైల్)

కదిరి అర్బన్: రైలు కింద పడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బలవన్మరణం పొందిన ఘటన మండల పరిధిలోని పట్నం గ్రామ సమీపంలో మంగళవారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. నల్లమాడ మండలం ఎర్రచెరువు పల్లికి చెందిన నరేష్‌కుమార్‌రెడ్డి (34) బెంగళూర్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. తల్లిదండ్రులు రాజారెడ్డి, మల్లీశ్వరితో కలిసి కదిరి పట్టణంలోని అమృత ఫంక్షన్ హాలు సమీపంలో నివసిస్తున్నాడు. నరేష్‌కుమార్ రెడ్డికి ఇంకా పెళ్లి కాలేదు. రెండు రోజుల క్రితం బెంగళూరు వెళ్తున్నానని ఇంటి నుంచి బయలుదేరాడు. ఏమైందో తెలియదు కానీ, మంగళవారం పట్నం గ్రామ సమీపంలో రైలు పట్టాలపై విగతజీవిగా కనిపించాడు. ఆత్మహత్యకు గల కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

పొట్ట కూటి కోసం వచ్చి పరలోకాలకు..

- విద్యుదాఘాతంతో తెలంగాణ వాసి మృతి



మృతి చెందిన నరసింహులు

పుట్టపర్తి: పొట్టకూటి కోసం తెలంగాణ రాష్ట్రం నుంచి వచ్చిన ఓ కూలీ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. పోలీసులు, బంధువులు తెలిపిన మేరకు.. తెలంగాణ రాష్ట్రం నారాయణపేట జిల్లా ఉట్కూర్తి మండలం నిడిగుర్తి గ్రామానికి చెందిన నరసింహులు (47), మరో ఆరుగురితో కలిసి 10 రోజుల క్రితం బుక్కపట్నం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన కేశప్ప ఇంటి నిర్మాణ పనుల నిమిత్తం వచ్చాడు. సోమవారం సాయంత్రం పనులు చేస్తున్న సమయంలో చేతిలో ఉన్న ఇనుప కడ్డీని ప్రమాదవశాత్తూ నరసింహులు విద్యుత్ తీగలకు తగిలించాడు. షాక్‌కు గురై కింద పడి పోయాడు. తోటి కూలీలు, ఇంటి యజమాని వెంటనే అప్రమత్తమై ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రాణాలు విడిచాడు. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు మంగళవారం ఎస్‌ఐ నరసింహుడు కేసు నమోదు చేశారు. మృతుడికి నలుగురు సంతానం కాగా, 25 సంవత్సరాలుగా ఎక్కడ కూలీ పనులుంటే అక్కడికి వెళ్లి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు.

దానిమ్మకు బ్యాక్టీరియా తెగులు

- సత్వర సస్యరక్షణ అవసరం
- డీహెచ్‌ఓ చంద్రశేఖర్

పుట్టపర్తి అర్బన్: ఇటీవల వరుసగా కురిసిన తేలికపాటి వర్షాలు, జడివాన, బలమైన గాలులకు దానిమ్మ తోటలను ప్రమాదకరమైన బ్యాక్టీరియా మచ్చతెగులు ఆశించి, దెబ్బతీసే పరిస్థితి నెలకొందని శ్రీసత్యసాయి జిల్లా ఉద్యానశాఖ అధికారి జి.చంద్రశేఖర్ తెలిపారు. ఈ క్రమంలో లక్షణాలు కనిపించిన తోటల్లో రైతులు ఏ మాత్రం అలసత్వం చేయకుండా వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలోని అనంతపురం రూరల్, యల్లనూరు, పుట్లూరు, కళ్యాణదుర్గం, రాయదుర్గం, కంబదూరు, బొమ్మనహాళ్, కణేకల్లు, పెద్దపప్పూరు, ధర్మవరం, తాడిమర్రి, గోరంట్ల, మడకశిర, పెనుకొండ, తనకల్లు తదితర మండలాల్లో 8,400 హెక్టార్లలో దానిమ్మ తోటలు విస్తరించాయన్నారు. పూత, పిందె దశలో ఉన్న తోటల్లో ఇప్పుడు బ్యాక్టీరియా తెగులు సోకి నష్టం కలగజేసే అవకాశం ఉందన్నారు.

నివారణ చర్యలు:

- తెగులు సోకిన పూత, పిందె, కాయలు తీసివేసి తోట బయట కాల్చి నాశనం చేయాలి.
- రోగం సోకిన కొమ్మలు రెండు ఇంచుల కిందకు కత్తిరించి బయట పడేసి కాల్చివేయాలి. అనంతరం ఒక శాతం బోర్డో మిశ్రమాన్ని పిచికారీ చేసుకోవాలి.
- 15 రోజుల తర్వాత మరోసారి ఒక శాతం బోర్డో మిశ్రమాన్ని పిచికారీ చేయాలి.
- గాలిలో తేమ పెరిగినపుడు తెగులు వ్యాప్తి అధికంగా ఉంటుంది. కాబట్టి జీవశిలీంద్రనాశిని 5 మి.లీ సూడోమోనాస్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.
- డ్రిప్ ద్వారా రోజు మార్చి రోజు ఒకటిన్నర గంటకు మించి నీళ్లు పెట్టకూడదు.
- నత్రజని సంబంధిత ఎరువులు, నీటిలో కరిగే ఎరువుల వాడకాన్ని తగ్గించాలి.
- వేపచెక్క, కానుగ చెక్క చెట్టుకు రెండు కిలోలు చొప్పున వేసుకుంటే సమర్థవంతంగా పనిచేస్తుంది.



తెగులు సోకిన దానిమ్మ చెట్టును పరిశీలిస్తున్న డీహెచ్‌ఓ చంద్రశేఖర్



బ్యాక్టీరియా మచ్చతెగులు ఆశించడంతో నాసిరకంగా మారిన దానిమ్మ

పాముకాటుకు గురైన రైతు మృతి



రైతు నాగేశ్ నాయక్

రామగిరి: పాముకాటుకు గురైన రైతు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని సుద్దకుంటపల్లి తండాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. సుద్దకుంటపల్లి తండాకు చెందిన నాగేశ్‌నాయక్(40) తన పొలంలో వేరుశనగ పంట సాగు చేస్తున్నాడు. భార్య సాలమ్మతో కలసి సోమవారం పంటకు నీరందించేందుకు వెళ్లాడు. స్ప్రింక్లర్ పైపులు మార్చుతున్న సమయంలో పాము కాటు వేసింది. కుటుంబసభ్యులు వెంటనే అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు బెంగళూరుకు తీసుకెళ్లగా, అక్కడి ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతునికి భార్యతో పాటు కుమారులు నితిన్‌నాయక్, నిరంజన్ నాయక్ ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జనార్దన్‌నాయుడు పేర్కొన్నారు.

ఇద్దరి డీబార్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు విద్యార్థులను డీబార్ చేశారు. ఈ మేరకు ఆ యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. అనంతపురంలోని ఓ పరీక్ష కేంద్రంతో పాటు కళ్యాణదుర్గంలోని ఓ పరీక్ష కేంద్రంలో ఒక్కొక్కరు చొప్పున మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతూ పట్టుబడినట్లు ఆయన పేర్కొన్నారు.

జగన్ మళ్లీ సీఎం కావాలంటూ పాదయాత్ర

అమడగూరు: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ విజయం సాధించి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటూ మార్కాపురానికి చెందిన షేక్ జిలాన్‌బాషా ప్రజా సంక్షేమయాత్ర నిర్వహిస్తున్నారు. మంగళవారం ఆయన పాదయాత్ర ఓడీ చెరువు మండలంలో సాగింది. విలేకరులతో ఆయన మాట్లాడుతూ మార్కాపురం నుంచి ఇచ్ఛాపురం వరకూ 4,200 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. మంగళవారంతో 25 రోజులు పూర్తికాగా 680 కిలోమీటర్ల ప్రయాణం సాగినట్లు పేర్కొన్నారు. పాదయాత్రలో ప్రజలతో మాట్లాడుతున్నానని, చివరగా సీఎంను కలసి సమస్యలను తెలియజేస్తానని చెప్పారు మరోసారి జగన్‌ను ముఖ్యమంత్రిగా చూడాలనే పాదయాత్రను చేపట్టినట్లు పేర్కొన్నారు. మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పాదయాత్రకు సంఘీభావం తెలియజేశారు.



ఓడీ చెరువులో జిలాన్‌బాషాకు సంఘీభావం తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఖర్చు మిగిలేలా.. 'ఖర్జూరం' బతికేలా..



ఖర్జూరపు చెట్టు చుట్టూ జేసీబీతో గొయ్యి తీస్తున్న దృశ్యం



వేర్లతో సహా పెకలించిన చెట్టును తరలిస్తున్న హిటాచి

బత్తలపల్లి: ఎంతో పెట్టుబడి పెట్టి పెంచుతున్న చెట్లను తొలగించాల్సి వస్తే ఆ రైతు పడే బాధ అంతా ఇంతా కాదు. విధిలేని పరిస్థితుల్లో తొలగించాల్సి వచ్చినా.. అలా నేలకూల్చిన చెట్లను వినూత్న పద్ధతిలో అనువైన ప్రదేశాల్లో సంరక్షించడానికి చర్యలు చేపడుతున్నారు ధర్మవరం పట్టణానికి చెందిన దాశెట్టి నాగరాజు. బత్తలపల్లి–ధర్మవరం ప్రధాన రహదారి సమీపంలో తన 24 ఎకరాల్లో ఈయన 1,500 ఖర్జూరపు చెట్లు సాగు చేస్తున్నారు. మొక్కకు రూ.5 వేల చొప్పున చెల్లించి సౌదీ దేశం నుంచి ఐదేళ్ల క్రితం తీసుకువచ్చి వీటిని నాటించారు. అయితే, బత్తలపల్లి నుంచి నిర్మిస్తున్న నాలుగు వరుసల బైపాస్ రోడ్డు తోట మీదుగా వెళ్తుండడంతో 450 మొక్కలు తొలగించాల్సి వచ్చింది. చెట్లను వేర్లతో సహా తొలగిస్తే మరో చోట పెంచవచ్చని తెలిసిన వారు చెప్పడంతో నాగరాజు అలానే చేస్తున్నారు. చెట్టు చుట్టూ ఉన్న ఈత పట్టలు తొలగిస్తూ, జేసీబీల సహాయంతో లోతుగా గొయ్యి తీసి వేర్లతో సహా బయటకు తీస్తున్నారు.అనంతరం హిటాచీల సాయంతో లారీల్లో ఉంచి పొదిలి, రాయచోటి, గుంటూరు తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఆయా చోట్ల ఉన్న మిత్రుల సహకారంతో చెట్లను మళ్లీ నాటి సంరక్షించనున్నట్లు నాగరాజు తెలిపారు. 10 రోజులుగా సాగుతున్న ఈ ప్రక్రియను స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.



వేర్లతో సహా బయటకు తీసిన ఖర్జూరపు చెట్టు